
# ఆశావాది  నిరాశావాది

"నువ్వు ఆశావాదివా? నిరాశావాదివా?" అని ఎవరైనా ప్రశ్నిస్తే మరో ఆలోచన లేకుండా నిరాశా వాదినని చెప్పేస్తాను. ఎందుకంటే నేను నిజంగా లోలోపల ఆశావాదిని. కాని, ఆ ముక్క ఎప్పుడూ పైకిచెప్పను స్వానుభవం వల్ల ఈ జీవిత సత్యం నేర్చుకున్నాను.

ఒకటికాదు. రెండుకాదు – నేను పుట్టి, బుద్ధి ఎరిగిన తరవాత ఎన్నో అనుభవాలు నెత్తిమీద మొట్టుకుంటూ వచ్చాయి. ఎన్నోసార్లు తల బొప్పికట్టింది. దాంతో ఇహ లాభం లేదని నిరాశా వాదిగా మారిపోయాను, ఆశావాదిగా వుంటూనే.

కొన్ని ఉదాహరణలిస్తేగాని ఈ జీవిత సత్యం మీకు బోధపడదు.

నాకు బాగా జ్ఞాపకంవున్న ఒక అనుభవం నాఆరోగ్యానికి సంబంధించింది. ఒకసారి స్నేహితుల దగ్గర – పబ్లిగ్గా–బడాయి పోయాను: నాకు జ్వరం ఛస్తేరాదని, ఇంతవరకెప్పుడూ రాలేదని.

రెండో రోజునో, మూడో రోజునో చచ్చేంత జ్వరం ముంచుకొచ్చింది. ఆ దెబ్బ దెబ్బ నెల్లాళ్ళ దాకా మంచం పట్టాను.

కె.వి. రామచంద్రమూర్తి




అప్పటినుంచి పద్ధతి మార్చేశాను. ఎవరైనా నన్ను "ఏమోయ్, బావున్నావా?" అని అడిగితే 'ఆ, ఏం బావుండడం లెండి. ఎప్పుడూ ఏదో నలతగా వుంటూనే వుంటుంది. ఆరోగ్యం బొత్తిగా చెడిపోయింది— నీరసంగా వుంటోంది—' అని సమాధానాలు చెబుతూ వుంటాను. అలా చెప్పడంవల్లే ఆరోగ్యానికి, అనారోగ్యానికి మధ్యస్థంగా ఒతకీడ్చుకొస్తున్నాను.

దీనికి నేను కనిపెట్టిన ఒకసూత్రం వుంది. "నాకెప్పుడూ జ్వరంరాదు" అని బడాయిగా చెబితే జ్వరానికి కోపం వస్తుంది. 'ఓహో! వీడి పని ఇల్లావుందా? వీడి పొగరు అణుస్తానాగు!" అని మీది కొస్తుంది.

అలా కాకుండా 'వొంట్లో బావుండడం లేదుసార్!' అని వినయంగా చెబితే "ఫరవాలేదు. వీడు బుద్ధిమంతుడి లాగానే వున్నాడు." అని దయతలచి జ్వరం మన జోలికి రాదు

అంటే ఏమిటన్నమాట? మనుషులకి, జంతువులకేకాక, ప్రాణంలేని వస్తువులకి, జరగబోయే సంఘటనలకి కూడా పరేంగితజ్ఞానం వుంటుందన్నమాట అవి మన్ని ఏడిపించాలంటే ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాయి. అనుగ్రహం కలిగితే ఆకాశానికెత్తేస్తాయి. నిజానికి అవే మన జీవితాన్ని తమ చెప్పు చేతల్లో వుంచుకుని మన్ని నడిపిస్తున్నాయి.

ఈ విషయం మీకు అర్థం కావడానికి మరికొన్ని ఉదాహరణలు చెప్పాలి.

మౌంటురోడ్డులో మీరు ఒకటో నంబరు బస్సుకోసం నిలబడతారు. మీరు అర్జంటుగా వెళ్ళవలసి వున్నట్టు దానికి తెలిసిపోతుంది. ఎంతసేపుఎదురుచూసినా ఛస్తేరాదు. మీకు అక్కర్లేనినంబర్ల బస్సులెన్నో వస్తాయి, పోతాయి. ఆరుద్రమల్లే 'నీవు ఎక్కదలచిన బస్సు-ఎప్పుడూ ఒక జీవితకాలం మిస్సు—' అనుకుంటూ నిరాశలో కుంగిపోతుంటారు.

అయితే, ఇక్కడే మీకు నేను చెప్పిన నిరాశావాదం అక్కరకు వస్తుంది. (నిరాశ వేరు, నిరాశా




వాదం వేరు) అప్పుడేం చెయ్యాలంటే 'అని పిచ్చిగాని, ఇప్పుడు ఒకటో నంబరు బస్సు ఎందుకు వస్తుంది? రాదు రాదు. అదిగో ఆ వచ్చేది ఇరవై ఒకటో నంబరు బస్సు. ఆదేం, స్పష్టంగా నంబరు కనబడుతుంటేనే?' అనుకోవాలి. ఊరికే అనుకోవడం కాదు. తన్ను మోసగించడానికి అలా అనుకుంటున్నట్టు ఒకటో నంబరు బస్సుకి తెలియకూడదు. నిజంగానే, మనస్ఫూర్తిగా చిత్తశుద్ధితో నిరాశ చేసుకోవాలి. మనం బస్సుకోసం ఎదురుకూడా చూడకూడదు. మనలో మనమేదో ఆలోచించుకుంటూ పరధ్యానంగా వుండాలి. అప్పుడు రపీమని ఒకటో నంబరు బస్సు వచ్చేస్తుంది. హాయిగా దానిలో ఎక్కి వెళ్ళిపోవచ్చు.

ఇలా ఎన్నిసార్లు నాకు జరిగిందో చెప్పలేను. ఎన్ని రకాల సందర్భాల్లో జరిగిందో చెప్పలేను

ఏది జరగాలని కోరుకుంటామో అది జరగదు. ఏది జరుగుతుందని కలలో కూడా అనుకోమో అది అమాంతంగా జరిగిపోతుంది. ఇది జీవిత సూత్రం.

మీరు ఏదన్నా ఉత్తరంకోసమో, మనియార్డరు కోసమో ఎదురుచూస్తూ వుంటారు. పోస్టువాడి కోసంచూసిచూసి మీకళ్ళుకాయలు కాస్తాయి; పువ్వులుకూడా పూస్తాయి. ఊహు. పోస్టువాడు మీ ఉనికిని గుర్తించనేగుర్తించడు. అందరికీ ఉత్తరాలిస్తాడు; అందరికీ మనియార్డర్లు ఇస్తాడు మీకు మాత్రం ఎన్నిసార్లు అడిగినా జాలిగా "లేదు సార్!" అంటాడు. రోజూ అడుగుతుంటే నీ మొహానికి మనియార్డరుకూడానా? అన్నట్టు ఒక చూపుచూసి జవాబివ్వకుండా వెళ్ళిపోతాడు.




అప్పుడు మీరు నిరాశ చేసుకుని గుండె రాయి చేసుకుని ఎదురు చూడ్డం మానేస్తారు. మీ పనిలో మీరు మునిగిపోయి దాని సంగతే మరచిపోతారు. అప్పుడు హఠాత్తుగా 'ఎంవోసార్' అంటూ ఎక్కడలేని గౌరవం తెచ్చిపెట్టుకుని సలాం చేస్తున్న ప్యూన్‌వాడి కంఠం కోకిల కూతకంటే తియ్యగా వినిపిస్తుంది.

మీరు ఒక పెద్దమనిషితో పని తగిలి మైలాపూర్‌నుంచి అష్టకష్టాలు పడి కోడంబాకం వెడతారు. ఆయన ఇంటిదగ్గర వుంటాడని మీరు అనుకుంటూ, ఆయనతో మాటాడవలసిన విషయాలన్నీ తూ. చా. తప్పకుండా మాటలు, పాటలు, సినేరియోతో సహా స్క్రిప్టు అంతా సిద్ధం చేసుకుని వెడతారు. ఆయన ఇంట్లో వుండడని మీకు గ్యారంటీగా రూపాయిన్నర స్టాంపు కాగితంమీద రాసిస్తాను.


అలా కాకుండా 'అబ్బే ఆయన ఇంట్లో వుండడు. ఎందుకుంటాడూ? ఉండవలసిన అవసరం ఏముంది? బహుశా వూళ్లోకూడా వుండడు. ఉండడయ్యా, నీకెక్కడూ చెప్పేది?' అని పూర్తిగా నిరాశతో, కేవలం డ్యూటీగనక వెడుతున్నట్టు వెళ్ళండి. నూటికి 90 పాళ్ళు ఆయన మీకు దొరుకుతాడు. దొరక్క పోయినా ఫరవాలేదు. మీరెలాగూ ఉండడనే అనుకుని వెళ్లారు కనుక మీరు నిర్ఘాంతపోరు, కుంగిపోరు. ఏమీ జరగనట్టు మామూలుగా ఇంటికి తిరిగివచ్చేస్తారు. అదే నేను మొదటి నుంచి మొత్తుకుంటున్న నిరాశావాదంలోవున్న గొప్పదనం!

నాకు తెలిసిన ఒకాయనకి నాలుగేళ్ళ కూతురుంది. ఆ అమ్మాయి "మూగమనసు" సినిమా పాటలన్నీ చాలా బాగా పాడుకుందని అందరితో చాలా గర్వంగా చెప్పుకునేవాడు. ముఖ్యంగా "గోదారీగట్టుందీ" అనేది మరీ బాగా పాడుతుందట. ఎవ్వరూ నమ్మేవారుకారు నాలుగేళ్ల పిల్ల బాగా పాడటమేమిటని. ఒకరోజున నలుగురు స్నేహితులను ఇంటికి ఆహ్వానించాడు స్పెషల్‌గా బజ్జీలు చేయించాడు. కాఫీఇచ్చాడు. తరువాత పాటకచ్చేరీ. కూతుర్ని ఒళ్లో కూర్చోబెట్టుకుని "పాడమ్మా వాళ్లంతా వింటారు" అన్నాడు.

ఆ పిల్ల పాడలేదు. ఎంతసేపు బతిమాలినా నోరెత్తలేదు చివరికాయన గట్టిగా గదమాయించాడు – "పాడతావా లేదా?" అని ఆ అమ్మాయి

పావురుమంది ఇహ ఆ పెద్ద మనిషి ఎంత స్లిగు పడిపోయాడో చూసుకోండి

మీరు ఆఫీసులో ఏదో పొరపాటు చేశారనుకోండి ఆఫీసరు చూడొచ్చాడా అని ధీమాగా దర్జాగా ఆఫీసుకి వెళ్లారా? తప్పకుండా అవాళ మీకు తిట్లు చివాట్లు తప్పవు అలాకాకుండా "బాబోయ్! అఫీసరు తిడతాడు గావునోయ్ దేవుడా! ఏదిగతినాకు? అని భయపడిపోతూ వెళ్ళండి ఆఫీసరు మీ సంగతే ఆలోచించకుండా తన పని తను చేసుకు పోతాడు



కథలపోటీలో మీకు ప్రైజు వస్తుందని ధీమాగా వుండండి రాదు రాదనుకోండి వస్తుంది (రావచ్చు)

ఎలక్షన్‌లో గెలుస్తానను కోండి గెలవరు డిపాజిట్టు పోతుందనుకోండి పోదు (గెలిస్తే గెలవచ్చు కూడా)

ఇలా ఎన్ని ఉదాహరణలైనా చెప్పగలను ఒక్క మాటలో చెప్పాలంటే ఏది కావాలని కోరితే అది రాదు వద్దనుకున్నది, రాదనుకున్నది వస్తుంది ఇది నేను కనిపెట్టిన జీవిత రహస్యం

అందుకే నా సలహా వినండి ఏది జరగాలనీ మీకు కోరికగా వుంటుందో దాన్ని ఎప్పుడూ కోరుకోవద్దు అది జరగదనే — వీలైతే జరగగూడదనే-కోరుకోండి అలాగే ఏది జరగగూడదని మీకు లోపల వుంటుందో అదే జరుగుతుందని భయపడిపోతూ వుండండి మీకు జీవితంలో ఢోకా వుండదు

ఈ నిరాశావాదంతో కూడిన ఆశావాదాన్ని ఒక సిద్ధాంతంగా డెవలప్ చేయడం మాత్రమే నేను చేసిన పని ఇది మన అందరిలోను కొద్దోగొప్పో వుంటుంది అందుకే ం ఏదో ఈ మాదిరిగానైనా ంకు వెళ్లదీసున్నాము లేకపోతే ...డో మట్టి కొట్టుకుపోయే ళ్ళం కాదుటండీ

***